క్లుప్తంగా

శ్రీవల్లెలాంబదేవిని దర్శించుకున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక



శ్రీవల్లెలాంబదేవి సన్నిధిలో మాజీ ఎంపీ బుట్టా రేణుక దంపతులు

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబదేవిని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, నీలకంఠ దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుట్టా రేణుక దంపతులు కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, లింగన్న, నీలంకృష్ణ, మాసుం, ప్రసాద్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు శనివారం 159 క్యూసెక్కులు విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.321 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: గ్రామాలలోవారంలో మూడు రోజులు ప్రత్యేక పారిశుద్ధ్య పనులను చేపట్టాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని సి.బెళగల్, పోలకల్ గ్రామాలలో గ్రామ సర్పంచ్‌లు చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ మంగళ, గురు, శనివారాలలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేట్టాలన్నారు. పారిశుద్ధ్య పనుల వివరాలను ఎప్పటికప్పుడు నివేదించాలని కార్యదర్శులకు సూచించారు.

వీఓఏ సమస్యలపై సీఈఓకు వినతి



సెర్ప్ సీఈఓ ఇంతియాజ్‌కు వినతి పత్రం అందిస్తున్న వీఓఏలు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం పొదుపు కార్యాలయంలో శనివారం వీఓఏలు సెర్ప్ సీఈఓ ఇంతియాజ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్ఆర్‌ఏ పాలసీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు భాస్కర్, పెద్దరాజు, విల్సన్‌బాబు, రామలక్ష్మి, చంద్రావతి, రజిని, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు కల్పించాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఓర్వకల్లు: ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ నటరాజ్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని కేతవరం, పూడిచెర్ల, కన్నమడకల, ఓర్వకల్లు గ్రామాల్లో గల పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి బూత్ వద్ద విద్యుత్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, ర్యాంపులు, తాగునీరు తదితరవి తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, ఆయా గ్రామాల వీఆర్‌ఓలు నాగరాజు, కృష్ణదేవరాయులు, బీఎల్‌ఓలు ఉన్నారు.

రిడ్జ్‌లో ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కర్నూలు(హాస్పిటల్): నగర శివారులోని రిడ్జ్ పాఠశాలలో ఈఫోరియా-2024 పేరుతో శనివారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వృక్ష సంరక్షకులు, గ్రీన్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ అబ్దుల్ ఘని హాజరయ్యారు. పాఠశాల సీఈవో జి.గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ సంపదలు ఎన్ని ఉన్నా వృథానే అని, విద్యాసంపద ఎవరికైతే ఉంటుందో సమాజంలో వారు గొప్పగా గౌరవించబడతారని చెప్పారు. రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి. పుల్లయ్య నగరంలో అనేక విద్యాసంస్థలను నెలకొల్పి ఎందరో భావి భారత పౌరులను తయారు చేస్తున్నారని కొనియాడారు.

ఒత్తిడిని జయిద్దాం!

- పెరుగుతున్న మానసిక వ్యాధి బాధితులు
- కోవిడ్ అనంతరం మరిన్ని సమస్యలు
- కుటుంబ, ఆర్థిక, ఆరోగ్య సమస్యలూ కారణమే
- ఒత్తిడిని అధిగమించడమే మార్గమంటున్న వైద్య నిపుణులు

పని ఒత్తిడి కాస్త ఎక్కువైతే ఆందోళన. ఏదైనా విషయం వింటే దాని వల్ల ఏమి పర్యవసనాలు వస్తాయోనని భయం. భవిష్యత్ ఏమైపోతుందోనని, ఎలాంటి అనుభవాలు ఎదురుచూడాల్సి వస్తుందోనని ఒకటే ఆందోళన. ఈ కారణంగా రాత్రిళ్లు నిద్రపట్టదు. పగలు పనిపై ధ్యాస ఉండదు. పది మందిలో ఉన్నా ఒంటరిగా ఉన్నట్లుగా ఉంటుంది. ఎంతో ఆనందం కలిగించే కార్యక్రమాలు జరుగుతున్నా మనసు ఎలాంటి సంతోషాన్ని ఆస్వాదించదు. ప్రస్తుతం చాలా మందికి ఈ మానసిక జబ్బు వేధిస్తోంది. దీని నుంచి త్వరగా బయటపడకపోతే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో పాతికేళ్ల క్రితం ఒకరిద్దరు మాత్రమే సైకియాట్రిస్టులు ఉండేవారు. ప్రస్తుతం కర్నూలు నగరంతో పాటు నంద్యాల, ఆదోని, డోన్‌లలో 30 మందికి పైగా సైకియాట్రిస్టులు ఉన్నారు. ఇటీవల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సైకియాట్రి విభాగానికి రెండు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ కారణంగా మరో మూడేళ్లలో ఇక్కడ మరో ఆరుగురు జూనియర్ వైద్యులున్నట్లే. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక వ్యాధుల విభాగం ఓపీకి ప్రతిరోజూ 80 నుంచి 100 మంది వరకు చికిత్స కోసం వస్తుండగా , ఇన్ పేషంట్లుగా 25 మంది దాకా ఉంటున్నారు. ఓపీ చికిత్స కోసం వచ్చేవారిలో 60 శాతం మంది కొత్తవారు ఉండటం గమనార్హం.ప్రైవేటుగా చికిత్స చేసే వైద్యుల వద్దకు సైతం ఒక్కొ క్కరి వద్దకు రోజూ 20నుంచి 50 మంది వరకు వెళ్తున్నారు. వైద్యుల వద్దకు వెళ్తున్న వారిలో ఎక్కువగా స్కిజోఫ్రీనియా, మానియా, డిప్రెషన్, అతిగా మద్యపానం, మత్తుపదార్థాలు సేవించడం, ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం, గృహహింసలతో బాధపడేవారు ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. వారిలో ఉన్న లక్షణాల ఆధారంగా కౌన్సెలింగ్, మందుల ద్వారా వైద్యులు నయం చేస్తున్నారు.

మానసిక ఒత్తిడితోనే అనారోగ్యం

మానసిక ఒత్తిడి వల్ల కడుపులో గ్యాస్(వాయువు), ఆవేశకావేశాల వల్లే అధిక రక్తపోటు, అతిబద్ధకం వల్ల చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా పెరగడం, అధిక స్వార్థం, మొండితనం వల్ల డయాబెటీస్ (మధుమేహం) , అతి విచారం వల్ల ఆస్తమా, ప్రశాంతత లోపించడం వల్లే గుండెకొట్టుకోవడంలో మార్పులు వస్తున్నాయని ఇటీవల వైద్యులు గుర్తించారు. మొత్తంపై శరీరంలో వచ్చే సర్వరోగాలకు మూలకారణాలు తరచిచూస్తే ఆహార అలవాట్లతో పాటు అధిక శాతం జీవనశైలి సంబంధమైనవేనని తెలుస్తోంది.

ఉల్లాసంగా గడిపేలా చూడాలి

ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లేవారు ప్రశాంతమైన మూడ్‌లో ఉండేందుకు నచ్చిన పాటలు వినాలి. వాకింగే కాదు ఉల్లాసంగా ఉండేందుకు ఏం చేస్తే బాగుంటుందో అదే చేయాలి. కొందరు వాకింగ్ ఇష్టపడితే మరికొందరు జిమ్‌కు వెళ్లాలనుకుంటారు. ఇంకొందరు యోగా, ధ్యానాన్ని ఇష్టపడతారు. అందుకని డాక్టర్లు పేషంట్ల ఇష్టానికే విడిచిపెట్టి ఎంతో కొంత వ్యాయామం మాత్రం చేయాలని సూచిస్తున్నారు. అలాగే పది మంది కలిసి నిత్యం ఉల్లాసంగా ఉండే విధంగా చూసుకోవాలి. వీలైనప్పుడల్లా విహార యాత్రలు చేయాలి. నచ్చిన సినిమాలు చూడాలి. కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపే విధంగా చూసుకోవాలి. అలాగే పనిచేసే ప్రదేశాల్లోనూ సహచరులతో కలుపుగోలుగా ఉండే విధంగా చూసుకుంటే ఎలాంటి ఇబ్బందులూ రాకుండా మానసికోల్లాసంతో పనిచేస్తారు.





కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక వ్యాధుల ఓపీ విభాగం ,చికిత్స కోసం వచ్చిన రోగులు

పెద్దాసుపత్రిలో ఐదేళ్లలో ఓపీ రోగుల సంఖ్య

సంవత్సరం	ఓపీ రోగుల సంఖ్య
2019	20,054
2020	13,365
2021	15,942
2022	19,475
2023	22,887

ఎక్కువగా కుటుంబసమస్యలే కారణం



మానసిక జబ్బులకు అధికంగా కుటుంబ సమస్యలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ఆర్థిక సమస్యలతో పాటు నిరుద్యోగం, జీవితంలో స్థిరపడలేకపోవడం, వివాహం కాకపోవడం, సోషల్ నెట్‌వర్క్, కుటుంబసభ్యులతో సఖ్యత లేకపోవడం వంటి కారణాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇటీవల కాలంలో స్త్రీలలో డిప్రెషన్ అధికమైంది. గృహహింస కేసులు కూడా అధికంగా ఉంటున్నాయి. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడం, చిన్న కుటుంబాలు ఏర్పడటంతో కుటుంబాల్లో మంచి చెడ్డలు చెప్పేవారు లేకపోవడమూ ప్రధాన కారణంగా నిలుస్తోంది.

– డాక్టర్ నాగేశ్వరరావు, మానసిక వ్యాధుల విభాగాధిపతి, పెద్దాసుపత్రి, కర్నూలు

మానసిక వ్యాధి లక్షణాలు

- ఆందోళన, భయం, గుండెదడ, అధికంగా చెమటలు పట్టుట, కాళ్లు, చేతులు వణుకుట
- అనవసర ఆలోచనలు మళ్లీ రావడం, అనవసర పనులు మళ్లీ మళ్లీ చేయడం
- చేతులు అదే పనిగా కడగటం, విచారంగా ఉండటం, పనిలో ఉత్సాహం లేకపోవడం
- ఆకలి, నిద్రలేకపోవడం, ఆత్మహత్యాలోచనలు, మతిమరుపు, జ్ఞాపకశక్తి తగ్గుట, ప్రవర్తనలో మార్పు
- సంధి ప్రేలాపనలు, తనలో తానే నవ్వుకోవడం, మాట్లాడుకోవడం, చెవిలో మాటలు వినపడటం, ఇతరులను అనుమానించడం, భర్త లేక భార్య శీలాన్ని శంకించడటం
- ఎక్కువగా మాట్లాడటం, తిరగటం, అతి ఆనందం, అతి ధైర్యం, అతికోపం, అతిగా డబ్బు ఖర్చు చేయడం
- ముసలితనంలో వచ్చే సమస్యలు, అనవసరంగా అనుమానాలు పెంచుకోవడం, అకస్మాత్తుగా ముందుగా జరిగిన సంఘటనలు మరిచిపోవడం
- కలత నిద్ర, నిద్రపట్టకపోవడం, నిద్రలో నడవటం, మాట్లాడటం, మూత్రవిసర్జన చేయడం, భయంకర కలవరింతలు, అతినిద్ర, నిద్రలో పళ్లు కొరకడం
- నిగ్రహాశక్తి కోల్పోవడం, జూదానికి బానిస కావడం, పరుల వస్తువులను దొంగిలించడం, అదే పనిగా షాపింగ్ చేయడం.

మానసిక వ్యాధులకు కారణాలు

- శారీరక, జన్యుపర, వంశానుగత అంశాలు కొన్నిసార్లు ప్రధాన పాత్ర పోషిస్తాయి.
- తలకు బలమైన గాయాలు కావడం, నాడీ వ్యవస్థలో తలెత్తే లోపాలు సమస్యలకు పునాది వేస్తుంటాయి.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు ప్రణాళికలు సిద్ధ చేయండి
- మండల మీట్‌లో అధికారులకు ఎమ్మెల్యే కాటసాని ఆదేశం

కల్లూరు: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తనివ్వకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కల్లూరు మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలఅధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతంపై మండల స్థాయి అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించడం లేదని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. బస్తిపాడులో పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని, ప్రైవేటు పాఠశాల ముందు స్పీడ్ బ్రేక్ వేయాలని కోరారు. పలువురు ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలన్నారు. సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేయాలన్నారు. పర్ల, యాపర్లపాడు, చెట్లమలాపురం గ్రామాల్లో మండల ఫండ్ కింద అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రమణమూర్తి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శరవేగంగా ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌లు



ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న డీటీ రామాంజనేయులు

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మండలంలో శరవేగంగా జరుగుతున్నట్లు కోడుమూరు డిప్యూటీ తహసీల్దార్ రామాంజినేయులు తెలిపారు. శనివారం మండలంలోని గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని డీటీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 13గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 2,045మంది లబ్ధిదారులు ఉన్నార, ఇప్పటి వరకు 700 ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ఆయా గ్రామాల సచివాలయాలకు వెళ్లి త్వరగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీటీ సూచించారు.

అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ ఏర్పాటు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దశాబ్దకాలంగా దీనికి బాలరాజు నేతృత్వంలో నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ పాలకమండలిగా వ్యవహరిస్తోంది. మూడు నాలుగేళ్లుగా సొసైటీలో అక్రమాలు రాజ్యమేలు తున్నట్లు తెలుస్తోంది. సహకార అధికారులు ప్రతి ఏటా నిర్వహించే ఆడిట్‌లో కూడా అక్రమాలు భారీగా వెలుగుచూశాయి. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులెవరో తేల్చేందుకు జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు జిల్లా సహకార ఆడిట్ అధికారి శిరీషను నియమించారు. ఈ నేపథ్యంలో ఇంతవరకు ఉన్న నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీని రద్దు చేసి ఆ స్థానంలో ముగ్గురు సభ్యుల అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సహకార శాఖలో అసిస్టెంటు రిజిస్ట్రార్ అయిన బి.రామకృష్ణ చైర్మన్‌గా... సహకార ఉద్యోగులు మున్వర్‌బాషా, తరుమల సభ్యులుగా పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ ఏర్పాటైంది. కాగా 51 కింద విచారణ గడువును మరో రెండు నెలలు పొడిగించాలని జిల్లా సహకార ఆడిట్ అధికారి శిరీష డీసీఓను కోరారు. అయితే, నెల రోజుల వరకు విచారణ గడువును పొడిగిస్తూ డీసీఓ ఉత్తర్వులు జారీ చేశారు.

బాబు మోసకారి

- చంద్ర బాబు, లోకేశ్ పర్యటనలతో వానదేవుడు ముఖం చాటేశాడు
- వైఎస్ జగన్ మాట మీద నిలబడే నాయకుడు
- ఆసరా వారోత్సవాల్లో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రజలను నమ్మించి మోసం చేయడంలో దిట్ట అని ఎమ్మెల్యే పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. శనివారం పాణ్యంలోని బొమ్మల దేవాలయంలో నిర్వహించిన ఆసరా వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కరువుకు కవల పిల్లలైన చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌కు ప్రజలతోపాటు ప్రకృతి కూడా సహకరించదన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పరని, అందుకు 2019 ఎన్నికల హామీల అమలే నిదర్శనమన్నారు. కరోనా సమయంలోనూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌దన్నారు. వైఎస్ఆర్‌సీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. వరుసగా నాలుగేళ్ల సంవృద్ధిగా వర్షాలు కురవడంతో రైతులకు రెండు కార్లకు సాగునీరు అందించగలిగామన్నారు. ఈ ఏడాది చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ రాష్ట్రంలో విస్తృత పర్యటనలు, పాదయాత్రలు చేయడంతో వరుణదేవుడు ముఖం చాటేశారన్నారు. ఈ విషయాన్ని రైతులే స్వయంగా చెబుతున్నారన్నారు. గతంలో ఎవ్వరూ చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ మహిళల ఆర్థికాభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు అండగా నిలబడాలని మహిళలను కోరారు.

రామాలయానికి భూమి పూజ

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం అయ్యపురెడ్డి కాలనీలో రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో రామాలయ నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాముడి ఆలయాన్ని ఆధునిక పద్ధతిలో నిర్మించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, బద్రీనాథ్ రావు, సుబ్బరాయుడు, గౌడ్ మాసుం, బాబు, మహేష్, రాముడు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి ఇంటర్ జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు

- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20 వరకు జరిగే ఈపరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు అమర్చి, సెంటర్లలోని ల్యాబ్‌ల్లో నుంచి లైవ్ ద్వారా పర్యవేక్షించేందుకు ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరగనున్నాయి.

కంట్రోల్ రూం నుంచే పర్యవేక్షణ..!

ఉమ్మడి జిల్లాలో మొత్తం 318 జూనియర్ కాలేజీల నుంచి 20,930 మంది ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు. వీరికి మొత్తం 115 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో విధులు నిర్వహించేందుకు 93 మంది ఎగ్జామినర్లు, 77 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. ప్రైవేటు కాలేజీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లుగా ప్రభుత్వ కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులను నియమించినట్లు ఆర్ఐఓ గురవయ్య శెట్టి తెలిపారు.



సీసీ కెమెరాల లైవ్‌స్ట్రీమ్‌ను తనిఖీ చేస్తున్న బోర్డు అధికారులు

అవయవదానంపై అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న డాక్టర్ కేజీ గోవిందరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): అవయవదానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన పెరగాలని, ఇందుకోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి చెప్పారు. శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ ప్రాంగణంలో అవయవదానంపై స్వచ్ఛంద సంస్థలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేజీ గోవిందరెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల క్రితం కర్నూలు నగరంలో పావనీలత అనే 26 ఏళ్ల మహిళ బ్రెయిన్‌డెడ్ అయి మరణించగా ఆమె తల్లిదండ్రులను ఒప్పించి అవయవదానం చేయించామన్నారు. ఆమె తాను మరణిసూ నలుగురికి ప్రాణం పోసిన ప్రాణదాత అని కొనియాడారు. ఆమె కూతురి ఉజ్వల భవిష్యత్ కోసం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమన్వయ సహకారంతో సహాయ నిధిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో మానవత సేవా సంస్థ జిల్లా చైర్మన్ గొంగటి మనోహర్‌రెడ్డి, ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి హేమలతరెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె. సురేష్‌కుమార్, బజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్ టి. ప్రతాపరెడ్డి, గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాసయాదవ్, విజ్ఞాన సేవా సమితి వైస్ ప్రెసిడెంట్ డి. రమణారెడ్డి, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు యానీ ప్రతాప్, నాగవేణిరెడ్డి, శశిధర్, జ్యోతిరెడ్డి, అపర్ణ, గీతా మాధురి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: స్థానిక సంకల్ బాగ్‌లోని హరి హర క్షేత్రంలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహా సంకల్పం, అంకురార్పణ, ధ్వజారోహణ, గోపూజ, పంచామృతాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం విశేషంగా జరిగాయి. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులను శేషవాహనంపై నగరంలోని పుర వీధుల్లో ఊరేగించారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, గౌరవ సలహాదారులు హెచ్‌కే మనోహరరావు, కమిటీ కార్యవర్గ సభ్యులు మాధవ ప్రభు, ప్రభాకర్ రావు, శివరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పుట్టకు పూజలు చేస్తున్న మహిళా భక్తులు

మళ్లీ వైఎస్ జగనే సీఎం

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్) : చంద్రబాబు నాయుడు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా, ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అవుతారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. కుళ్లు, కుతంత్రాలు, అవినీతికి కేరాఫ్ చంద్రబాబు అని విమర్శించారు. శనివారం స్థానిక సి.క్యాంపులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం వినాశనమే లక్ష్యంగా చంద్రబాబు పనిచేస్తున్నారని, అందుకు షర్మిలను పావుగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావును వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్న మోసగాడు చంద్రబాబు అన్నారు. అధికారం కోసం ఎంతకైనా దిగజారే నాయకుడు బాబు అని విమర్శించారు. దేశంలోనే అత్యధికంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బడుగు, బలహీన వర్గాల ఆర్థిక తోడ్పాటుకు కృషి చేసిన నేత వైఎస్ జగన్ అని కొనియాడారు. సమావేశంలో పార్టీ నాయకులు నన్నూరు బేగ్, దూపాడు మల్లేష్, శంకరయ్య, మద్దిలేటి, రాజశేఖర్ అర్జున్ పాల్గొన్నారు.

నేడు ముస్లిం మైనార్టీల హక్కుల మహా గర్జన



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ మహబూబ్‌బాషా

కర్నూలు(అర్బన్): ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ కోసం నేడు (ఆదివారం) మహా గర్జన నిర్వహిస్తున్నట్లు ముస్లిం రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డా.షేక్ మహబూబ్‌బాషా తెలిపారు. శనివారం నగరంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు పాత కంట్రోల్ రూమ్ సమీపంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహించే ఈ గర్జనకు ముఖ్య అతిథిగా మోటివేటర్ స్పీకర్ బ్రదర్ షఫీ హాజరవుతున్నారన్నారు. రాష్ట్రంలోని 66 వేల ఎకరాల వక్ఫ్ భూములను రక్షించడంతో పాటు అన్యాక్రాంతమైన భూములను పరిరక్షించి పేద ముస్లిం మైనార్టీలకు పంపిణీ చేయాలన్నారు. వక్ఫ్‌బోర్డుకు చెందిన స్థలాల్లో షాపింగ్ మాల్స్, కాంప్లెక్స్‌లు నిర్మించి ముస్లిం మైనార్టీలకు లీజుకు ఇవ్వాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ముస్లిం మైనార్టీలకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్ల కేటాయింపులో ప్రాధాన్యత కల్పించాలన్నారు. హక్కుల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ మహా గర్జనకు పెద్ద ఎత్తున ముస్లిం మైనార్టీలు హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఫోరం నాయకులు రోషన్‌ఆలీ, డా.సుభాన్, ముస్లిం, మైనార్టీ నాయకులు తాటిపాడు మాబుసా, సయ్యద్ షా ముర్తుజా ఖాద్రీ, రెహమాన్, షోయబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జంప్‌రోప్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 12 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్ బాల బాలికల జంప్ రోప్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జంప్ రోప్ అసోసియేషన్ కార్యదర్శి జోసఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల17 వ తేదీ అనంతపురం జిల్లా కదిరి తాలుకాలోని నల్లమడ గ్రామంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీల్లో పాల్గొంటార ని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వివరాల కోసం 8790708391 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

దాడులను అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు డిమాండ్ చేశారు. శనివారం పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గోనెగండ్లలో దళిత మద్దిలేటిపై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. కిసాన్ ఘాట్‌లో అంబేడ్కర్ చిత్రంపై బీజేపీ పోస్టర్లను అంటించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుస్వామి, దేవసహాయం పాల్గొన్నారు.